# 5. పిల్లికళ్లూ, పాముచెవులూ!

**మా** అత్తగారి సూక్ష్మబుద్ధిని మాత్రం నేను మెచ్చుకోకుండా ఉండలేను. ఇంతింత దళసరి కళ్లద్దాలు పెట్టుకుంటే ఏంగాక, మనకి కనబడనివి ఆవిడకి కనబడి తీరుతాయి. అదేం చిత్రమో!

'మీ అత్తగారి మాటకేం గాని నీ దృష్టి మాత్రం ఎక్కడో మాకు స్పష్టంగా తెలుసు' అని మా ఎదురింటి రాజ్యం ఎత్తిపెడితే నేనేం చెప్పలేను మరి. అయినా ఆ మాట ఒప్పుకోడానికి నాకేం అభ్యంతరం లేదు కూడా. నిజమే, నా దృష్టి మా అత్తగారి చెవులనున్న వజ్రాల దుద్దుల వైపే. అయితే ఏమిటిట? వాటి ఖరీదు ఈ రోజుల్లో అయితే ఏభైవేల పైమాట అనీ, తక్కిన మా ముగ్గురు తోడి కోడళ్లకి కాక అవి నాకే యిస్తాననీ మా అత్తగారు చెబుతూంటే విన్నాను మరి. ఆశ పడితే ఆక్షేపణ ఏముంది! మా బావగార్లలా మా ఆయనకి పెద్ద ఉద్యోగమూ లేదు. మా పుట్టింటి వారికి ఏమంత ఆస్తీ లేదు! ఉన్నమాట నాలో నేను అనుకోడానికైనా ఉలుకెందుకంట! ఆడదాన్ని కదా!

ఏదో చెప్పబోయి ఎక్కడికో వచ్చినట్టున్నాను కదూ! సరే అసలు విషయానికి వస్తాను. మొన్నీమధ్య ఆవిడతో కలసి ఓ పెళ్లికి వెళ్లడం జరిగింది. అప్పుడే నాకు మరోసారి అనుభవానికి వచ్చింది, మనలాంటి సామాన్యులు కలలోనైనా ఊహించలేనివి ఆవిడ ఎంత బాగా పసిగట్టగలరో! ఇంతకీ అది పెళ్లి పందిట్లో జరిగిన వింత కాదు సుమండీ!

"మా హేమ ఈ ఊళ్లోనే పోస్టాఫీసు పక్క సందు ఇంట్లో ఉందని విన్నాను. పదవే, ఓసారి వెళ్లి చూసొద్దాం. మన శాఖ వాళ్లే అయినా హేమని ఈ పెళ్లికి పిలవలేదు. ఏంచేతంటావ్? వాళ్ల నాన్నంటే మగాడూ, ఏం చేసినా చెల్లుతుంది. ఆడదానికి దీనికీ అదే పోగాలం అయితే సంఘం ఒప్పుకుంటుందా?" అంటూ మొదలెట్టింది మా అత్తగారు.

"మరి అలాంటి చోటుకి మనమెందుకండీ?" అని నేనడక్కుండానే " బావుంది. అదంటే అన్నిటికీ తెగించి అందర్నీ తెంపుకుంది గాని అదేం నాకు పరాయిదా? స్వయంగా మా దొడ్డమ్మ మనవరాలు. అందర్లా నేనూ మనసు చంపుకుంటే నా పెద్దరికం ఏముంటుంది గనక!"

అంటూ నాకు బాగా దగ్గరగా జరిగి నాకే వినపడేటట్టు "అదేమైనా ఇస్తే పుచ్చుకోకు. మంచి నీళ్లు కూడా. మరచిపోకేం?" అని హెచ్చరించి మరీ బయల్దేరదీసింది.

మేం ఆ ఇంట్లో అడుగుపెట్టేసరికి గోడ గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. మమ్మల్ని చూడగానే హేమ ఎంతగానో ఆదరించింది. "ఎన్నాళ్లయింది పిన్నీ, నిన్ను చూసి!" అంటూ ఆవిడ చేతులు పట్టుకు వదల్లేదు. "బొత్తిగా అలా నీరసంగా తయారయావేమిటి హేమా!" అంటూ మా అత్తగారింకా ఏదో చెబుతూంటే వినిపించుకోకుండా "అపుడే ఎండెక్కిపోయినట్టుంది. ముందుగా ఇంత చల్లని నిమ్మరసం కలిపి తెస్తానుండండి" అంటూ మా అత్తగారు వారిస్తున్నా వినకుండా పక్కసందులోంచి దూరంగా ఉన్న కిచెన్‌లోకి కాబోలు గబగబా వెళ్లిపోయింది.

"చూశావా, చూశావా! ఈ డొక్కు ఫేనూ, ఈ పాత క్రర కుర్చీలూ తప్ప కంటికి నరైన ఒక్క వస్తువైనా కనపడుతోందా ఇక్కడ?" అంటూ ఆ కళ్లజోడు చివర్లోంచి వీలైనంత దృష్టి సారించి, కాస్త స్వరం తగ్గించి కొనసాగించింది.

"పోనీ ఒక్కముక్క నువ్వే చెప్పు. మన భగవద్గీత ఏమని చెబుతోంది? వర్ణసంకరం కూడదని చెప్పిందా లేదా? తండ్రేమో హిందీదాన్ని కట్టుకుంటాడా, దీని సంసారమేమో తురకాడితోనా! ఇలాంటి ఘోరాలకి తలపెడితే ఇంకెలా అఘోరిస్తాయి కొంపలు! ఇప్పుడా తండ్రిగాడు చచ్చి ఊరుకున్నాడా, ఇక ఈ చెడిపోయినదాన్ని ఈ తురక మొగుడు ఉద్ధరిస్తాడా! ఎక్కడ ఎవర్తిని పెట్టుకుని కులుకుతున్నాడో! అన్నట్టు దీనికో కొడుకూ కూతురూ కూడా ఉండాలమ్మోయ్, ఈ పాటికి బాగా పెద్ద వాళ్లే అయి ఉండాలి. ఆ మధ్య కొడుక్కి పెళ్లి చేస్తున్నానని శుభలేఖ కూడా పంపింది. దీన్లా అందరం కులం చెడినవాళ్ల మనుకుందో ఏమిటో! ఏడాది పైమాట గానే అయి ఉండాలి. ఇంతకీ కూతురెక్కడ ఉందో ఏమిటో! నా వెర్రిగాని 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా!'"

అలా చెబుతూ చెబుతూ టక్కున ఆపేసింది. ఏదో పనిగట్టినట్టు "చూడూ, అవతలి గదిలోంచి సీలింగ్ ఫేనో ఏదో తిరుగుతున్న చప్పుడులాంటిది వినపడ్డం లేదూ!"

నిజమే, నేను గమనించనే లేదు. అంత వృద్ధాప్యంలోనూ ఆ చెవులకెంత శక్తి ఇచ్చాడో దేవుడు!

"ఇప్పుడు గుర్తొచ్చింది. కొడుకూ కోడలూ దీనిదగ్గరే ఉన్నట్టున్నారని పెళ్లి పందిట్లో ఒకరినోట విన్నాను. ఆదివారం కదా, వాళ్లు ఇంటిపట్టునే ఉండి ఉండాలి. కనబడరేం చెప్మా!" అంటూ కార్యరంగంలోకి దిగిపోయింది మా అత్తగారు.

నేనింకా పెరటిదారిలోనే ఉన్నాను. మేం కూచున్న వీధి గదికి ఆనుకునే లోపలివైపుకి ఓ గది ఉంది. అందులోది కాబోలు ఫేను చప్పుడు. లోపలివైపు తలుపులు వేసి ఉన్నట్టున్నాయి. అంతమాత్రాన లోపలికి చూసే మార్గాలే కనపడవా మా అత్తగారి సూక్ష్మదృష్టికి!

క్రరకుర్చీ నన్ను కదలకుండా పట్టుకోమని అంతమనిషీ అదెక్కి వెంటిలేటర్లోంచి అదే తొంగిచూడ్డం! అంతేకాదు, అదేపని నేను చేసేదాకా వదలకపోడం!

ఇంతకీ మా అత్తగారి దర్శకత్వంలో నేనేం చూశానో అడగరేం?

కొడుకూ కోడలూ కాబోలు దగ్గరగా పడుకుని గుర్రెట్టి నిద్దరోతున్నారు! ఎక్కిదిగిన ఆయాసాన్ని పమిట చెంగుతో ఒత్తుకుంటూ "చూశావా, దీని కోడలు దీన్నెంత హీనంగా చూస్తోందో, నీ కళ్లతో నువ్వే చూశావా! ఇంత పొద్దెక్కేక కూడా అది నిమ్మకి నీరెత్తినట్టు నిద్రపోడమా! ఇంత ముసిల్దీ, కళ్లల్లో ఉన్నాయి ప్రాణాలు, ఈ హేమ ఒళ్లు విరుచుకుని చాకిరీ చెయ్యడమా! అవున్లే! నీతీ జాతీ లేని అత్తగార్ని ఏ కోడలు గౌరవిస్తుందిలే! ఛ, ఇంతకంటె నాలుగిళ్లలో అంట్లు తోముకుంటే నయం.... చాల్లే, వచ్చిన పనైపోయింది, లేద్దాం పద" వీధిలో ఓ సైకిలు రిక్షా వెడుతూంటే ఆపు చేశాం.

"అదేమిటి పిన్నీ, అప్పుడే వెళ్లిపోతారా! ఇన్నాళ్లకొచ్చారు, ఇది మీకు న్యాయమా!" అంటూ ట్రేలో రెండు గ్లాసుల ఐసుముక్కలు వేసిన నిమ్మరసం పట్టుకువచ్చింది హేమ.

"ఏదో వచ్చాం. చూడాలనుకున్నాం, చూశాం. వస్తాం మరి" అంటూ రెండు గ్లాసులూ ఖాళీ చేసింది మా అత్తగారు, నాకు ఐస్‌వాటరు పడదని అడ్డంగా కోస్తూ, హడావిడిగా రిక్షా ఎక్కుతూ.

ఆ తొందరపాటులో చిన్న పొరపాటు జరిగింది. తీరా రిక్షా దిగి చూసుకునే సరికి మా అత్తగారి మొహాన ఎప్పుడూ ఉండే కళ్లజోడు లేదు! తన అశ్రద్ధకి నన్ను తిట్టి, అదే రిక్షామీద హేమ వాళ్లింటికి లగెత్తించింది. కుర్చీ ఎక్కి పక్క గదిలోకి రహస్యంగా చూసింది కదా, ఆ దృశ్యానికి తట్టుకోలేక ఒళ్లంతా చెమటపట్టి, కింద కూచున్నాక కళ్లజోడు తీసి పక్కనున్న బల్లమీద పెట్టి, మొహం తుడుచుకోడం గుర్తొచ్చింది. మళ్లీ పెట్టుకోడం మరచిపోయినట్టుంది.

నేననుకున్నది కరక్టే. వెళ్లి చూశాను. అదక్కడే ఉంది. అందుకున్నది కళ్ళజోడు ఒక్కటే కాదు.

హేమగారి నోట ఇంకా చాలా విషయాలు అందుకున్నాను.

ఆవిడ నాన్నగారు, అదే శర్మగారంటారుట, ఆ రోజుల్లోనే బ్రహ్మసమాజంలో ఓ తర్ఫీదు పొందిన కార్యకర్తట. ఆ సందర్భంలోనే ఓ ఉత్తరాది అమ్మాయిని ప్రేమించి పెళ్లాడారట. హేమని అందించిన నాలుగైదేళ్లకే ఆవిడ కన్ను మూసిందట. తల్లీ తండ్రీ అన్నీ తానే అయి శర్మగారు హేమని పెంచారు. ఆయన ఓ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా రిటైరయారట. ఆయన స్టూడెంటే, అదే కాలేజీలో లెక్చరరుగా వచ్చిన కరీమ్‌కి హేమనిచ్చి రిజిస్టర్డ్ మేరేజీ చేసిందీ ఆయనేనుట. హేమ కూడా కొన్నేళ్లు జూనియరు లెక్చరరుగా చేసిందిట. శర్మగారు పోయి రెండేళ్లయిందిట.

ఇవన్నీ చెబుతూ వాళ్లమ్మాయి సంకల్ప ఫొటో చూపిస్తూ హేమ అంది. "అన్నీ ముందుగా తెలిసే ఆ పేరు పెట్టేమా అనిపిస్తుంది. అంతా మా నాన్న పోలిక. ఒకరిచేత ఒక్క పనిచేయించుకుని ఎరగదు. ఒక్క మాట పడదు".

బర్కిలీలో యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఎమ్మెస్ ఫైనలియర్‌లో ఉందిట.

"సీటు వచ్చింది గాని కొద్దిలో స్కాలర్‌షిప్ తప్పిపోయింది. అమెరికాలో చదువంటే మాటలు కాదుగదా... చదవనని ఒకటే పేచీ. ఆ ఖర్చంతా మేం భరిస్తామంటే ఒకే ఒక షరతు మీద ఒప్పుకుంది. తనకి ఉద్యోగమయ్యాక అంతా అణాపైసలతో వడ్డీతో తీర్చేస్తుందిట అదైనా మా లీల చెప్పి ఒప్పిస్తేనే!" లీల ఎవరో నేనడక్కుండానే చెప్పింది హేమ. ఆవిడ కోడలట. స్టేటు బ్యాంకులో క్యాషియరుగా పని చేస్తోంది. కొడుకేమో గవర్నమెంటు డాక్టరు.

"సాధారణంగా మా లీల ఇంటికొచ్చేసరికి ఏ ఎనిమిదిన్నరో అయిపోతుంది. మావాడు సరేసరి. ఊపిరి తిరగని పని. మళ్లీ తెల్లారి ఆరున్నరకైనా లేచి ఉరుకులూ పరుగులూ పెడితే గాని డ్యూటీలకి అందుకోలేరు. అందుకే ఒక్క ఆదివారమైన విశ్రాంతి తీసుకోమంటాను. 'తొమ్మిదిలోగా లేచారో

నన్ను చంపుకు తిన్నట్టే' అని ఒట్టు వేయించుకున్నాను. ఎండపడి వచ్చారు, మీకేదో చల్లనిది ఇంత కలిపి ఇచ్చి వాళ్లని లేపుదామనుకున్నాను. మీ అత్తగారికి ఎక్కడైనా కాలు నిలబడితేనా!''

ఒక్క గడియ ఊరుకుని హేమ అన్నదిదీ. "పడుచువాళ్లు వీళ్లేం కష్టపడినా నాకేం అనిపించదు. అక్కడ మా ఆయన కరీమ్ పడే పాటో! ఈమధ్య తన ఒంట్లో బావులేదు కూడా. అయినా కూతురికి డబ్బు పంపించాలని, మళ్లీ ఉద్యోగం దొరకదని, ఆ ఊళ్లో అదే కాలేజీలో సీనియర్ లెక్చరర్‌గా కంటిన్యూ అవుతున్నారు. 'ఇంకెంతలే! ఈ ఏడాదితో దాని చదువైపోతుంది. పై పిల్ల పాపం ఆ లీల కడుపు కట్టుకుని డబ్బు పంపిస్తూంటే, కన్న తండ్రిని నాకేనా బాధ్యత లేనిది?'' అంటారు పైగా....'' ఇవన్నీ తలచుకుంటే ఇప్పుడు నా తల సిగ్గుతో వంగిపోతుంది. 'చెడిపోయిన అత్తగార్ని కోడలు ఎలా రాసి రంపాన పెడుతుందో నువ్వే చూడు' అని మా అత్తగారు సూచిస్తే నమ్మడమే కాక ఆవిడ సూక్ష్మదృష్టికి మురిసిపోయాను. పైదేశంలోని ఓ ఆడపిల్ల చదువుకోసం ఈ దేశంలో ఇన్ని ప్రాణులు అలమటిస్తుంటే మేం అంచనా వేసుకున్నది ఎంత లజ్జాకరంగా ఉంది! చదువన్నది దరిదాపులకి రానియ్యకపోవడం వల్లనేమో ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలు! ఇప్పటికైనా ఆవిడ వజ్రాల దుద్దులవైపు అట్టే దృష్టి మళ్లించకూడదని నాలో నేనే ప్రతిజ్ఞ చేసుకున్నాను. ఆడదాన్ని, నామాట ఏమాత్రం నిలబెట్టుకుంటానో ఏమిటో!

★